# వంటమనిషి

అసలు వంటావిడను పెట్టే ఆలోచన నాదే కాదు—మా ఆవిడది. నన్ను నాలుగు నెలలు పోరిన మీదట గాని నేను సరేనన లేదు. దీనికి ప్రబలమైన సాక్ష్యం తీసుకురాగలను. ఏమండీ, వంటమనిషిని చూద్దురూ—అని ఆవిడ అన్నప్పుడల్లా, నేను .... ఉన్న ఖర్చు చాలకనా? అని అడుగుతూనే వచ్చాను.

నేనీప్రశ్న అడగటంలో నిష్ఠూరం ఎంతమాత్రం లేదు. కొంపలో ఉన్నది నలుగురు ప్రాణులం; ఇంటిఖర్చు చూడబోతే మూడువందలు. ఇందులో ఇంటిఅద్దె లేదు. నా సొంతఖర్చు లేదు; అడపాతడపా తగులుతూండే డాక్టరు బిల్లు లేదు. ఏమీ లేకుండానే నెలకు మూడువందలు.

నేనీమాట అంటే మా ఆవిడకు చాలా ఆగ్రహం వచ్చేది. వంటావిణ్ణి పెట్టకపోగా తాను డబ్బంతా దుబారా చేస్తున్నట్టు నేను ఆరోపణ చేస్తున్నానని. కావలిస్తే లెక్క

చూపిస్తానన్నది. కష్టపడి ఒక నెల లెక్క వేసిందికూడా. ఆ నెల 318 రూపాయలు ఖర్చయింది. లెక్కలో కూడిక తప్పులుగాని, దుబారాకింద పాటించదగిన అయిటములుగాని లేవు.

కాని, సందేహం సందేహంగానే వుండిపోయింది. ఈ లెక్క నిజమైతే మూడొందలు కంటె తక్కువ సంపాదిస్తూ ఇంకా పెద్ద కుటుంబాలను నిర్వహించేవాళ్ళ మాటేమిటి? వాళ్ళు సబ్బులు తోముకోవడంలేదా, టూత్ పేస్టు వాడటంలేదా, రెండుపూటలా అన్నమూ, ఒకపూట టిఫినూ తినటంలేదా, వాళ్ళు బట్టలు కట్టుకోవడంలేదా? ఇంతడబ్బు ఖర్చుచేసి మేం ఘనంగా బతుకుతున్న జాడలేమీ లేవు. మా ఆవిడ పేరంటానికి వెళ్ళొచ్చినప్పుడల్లా ఫలానా ఆవిడ నూరు రూపాయల చీర కట్టుకొచ్చిందనీ' ఫలానా ఆయన కూతురు రవ్వల బేసరి కొన్నదనీ, ఫలానా వాళ్ళ పిల్లలు మఖ్మల్ చొక్కాలు తొడుక్కు వచ్చారనీ చెబుతుంది. వాళ్ళూ నాబోటి ఆర్జనపనులే కాని అంతకంటే ఎక్కువ సంపాదించే వాళ్ళుకారు - అయితే, చెప్పుకో నవసరమే ఉండదు.

వంటావిణ్ణిపెట్టు....అని మా ఆవిడతో అనేలోపల నా చేతిలోవున్న ఒక్కపనీ చేసేచా.... "ఇంటిఖర్చు ఎట్లాగయినా పాతిక రూపాయలు తగ్గేటు చూడు. వంటమనిషిని పెడదాం. వంటమనిషికింద ఎంతలేదన్నా యాభైకి తక్కువ కాదుగదా?" అన్నాను.

ఆ నెల మా ఆవిడ గడ్డి పెట్టేసింది. కాఫీ నీళ్ళ కాఫీ అయిపోయింది. అన్నంలో ఒకపూట కూరవుంటే ఇంకో పూట పచ్చళ్ళే. పదిహేనో తారీకు తరువాత ఇక టూత్ పేస్టు లేదు. అందరూ పౌడరు పెట్టి తోముకోండి .... అని మా ఆవిడ నోటీసిచ్చింది. కొంచెం భోజనానికి ఆలస్యంగా వచ్చినపూట చప్ప చల్లారిన పదార్థాలు తినవలసివచ్చింది. కాస్త వెచ్చచేయకపోయావా? అంటే ఈ నెలల్లా ఒక గుండు బాగులే. అవ్వాకావాలి బువ్వాకావాలంటే ఎట్లా? అన్నది. అవ్వంటే డబ్బని అర్థం చేసుకున్నాను. ఇన్ని త్యాగాలు చేస్తే ఆ నెల 29కి ఖర్చయింది.

ఇక నేను సంకోచింపలేదు. డబ్బాపోయి శనీపట్టి నట్టు ఇంతఖర్చు అవుతూండగా లేండి, ఇంకో యాభై అయితే మటుకేమని వంటావిణ్ణి పెట్టటానికి అనుమతి ఇచ్చేశాను.

వంటావిణ్ణి పెట్టడం సులభమైనపని అనుకునివుంటే మా ఆవిడ చాలా పొరపాటు పడింది. ముట్టమొదట మాకు కుదిరిన వంటావిడ స్టోరు రూములో సరుకు మాయం చేయ సాగింది. "నిన్న వీశెడు చింతపండు కొంటే అప్పుడే సగం అయిపోయిందేమిటి? అని మా ఆవిడ అనేసరికి వంటావి డకు ఆగ్రహంవచ్చి చెప్పకుండా వెళ్ళిపోయింది. బియ్యం డబ్బా చూసుకున్నాకగాని ఆవిడ అట్లా వెళ్ళిపోవటానికి కారణం తెలియలేదు.

ఆ తరువాత మా పాలబడిన వంటావిడ మొదటి ఆవిణ్ణి మరిపించింది. ఆవిడ మా భోజనం తినదట. నెలకు నలభై ఇవ్వమంది. నా ఉద్దేశంలో చవుకే ననిపించింది,

ముందు వచ్చినావిడకి రెండు పూటలూ తిండి, కాఫీయిచ్చి పదిహేను జీతం ఇవ్వడానికి ఒప్పుకున్నాం. తిండికింద పాతిక కన్న ఎక్కువే అవుతుంది. మొదట మా ఆవిడ ఒప్పలేదు. వంటావిడ తిండికూడా పాతికేమిటన్నది? మనం తినే తిండేకదా ఆవిడకూడా తింటుందీ? అన్నాను. అదేం కుదరదు. మనతో సమంగా ఆవిడ కూరలూ అవీ తినటానికి వీల్లేదు అన్నది. వంటచేసే మనిషిని ఎట్లా ఆపగలవు? ఒకవేళ ఆపదలిస్తే నువ్వు వంటచేసినంతపనీ చెయ్యటమేగాక, ఆవిడ అన్నం తినేటప్పుడు కాపలా కాయాలి అన్నాను. ఈ విధంగా చాలాసేపు మాట్లాడుకున్నాక, మేం చర్చించేది ఈ వంటావిడకు వర్తించదని మాకు జ్ఞాపకం వచ్చింది. ఎందుకంటే ఈవిడ మా యింట్లో తినదు.

నేను మళ్లా మొదటికివచ్చి, పదిహేను వంటచేసినందుకూ, పాతిక అన్నం తిననందుకూ ఇవ్వవచ్చునన్నాను. "అక్కడే మీరు పొరబడుతున్నారు. ఆవిడ ఏ పది రూపాయలలో తన తిండికింద ఖర్చుచేసి మిగతాదంతా మిగుల్చుకుంటుంది" అన్నది మా ఆవిడ.

"మిగుల్చుకోనీ, మనకేం?" అన్నాను.

"అట్లా వీల్లేదు" అన్నది మా ఆవిడ.

"అయితే బేరం చేసిచూడు" అన్నాను.

మా ఆవిడ ఆ వంటావిడతో గంటన్నర బేరంచేసి చివరకు నలభై రూపాయలివ్వటానికి ఒప్పుకున్నది. ఆపూట నేను ఆఫీసుకి అరగంట ఆలస్యంగా వెళ్ళాను.

ఈ కొత్త వంటావిడ మూడుపూటలు కాబోలు మా యింట్లో వంటచేసింది. ఆవిడ చేసిన పదార్థాలు నాకు కొంచెమైనా నోట పట్టలేదు. అయితే అయింది. మా ఆవిడ సుఖపడిపోతే అదే చాలునని మాట్లాడక ఊరుకున్నాను. కాని మా ఆవిడ మర్నాడు సాయంకాలం నేను రాగానే వంటావిడ్ని పంపించేశాను అనేసరికి ఆ భ్రమ కాస్తా తొలగిపోయింది.

"ఏం జరిగింది ?" అన్నాను.

మా ఆవిడ కోపం తెచ్చుకుంటూ.... నేను వంటచేసినంతకాలం ఇందులో ఉప్పు తక్కువనీ, అందులో కారం తక్కువనీ, ఇది కుదరలేదనీ, అది అటువంటిదనీ తప్పులు పట్టేవారే ఆవిడివంట మాట్లాడకుండా తిన్నారే? వంట అంత బాగుందా ? అన్నది.

"ఇదీ తప్పే అయిందా?" ఆవిడ ఏదని తప్పుపట్టను? అంతా తగలబడ్డట్టే ఉంది. అందుకేనా పంపేశావు ?" అన్నాను.

అచ్చంగా అదేనా? నన్ను వంటింట్లోకి రావద్దంటుంది. నీళ్ళబిందె ముట్టుకోవద్దంటుంది. కూరలబుట్ట తీసుకుపోయి వంటింట్లో పెట్టుకుంది. ఎంతెంతకూరలు మిగిల్చిందో చూద్దామని చెయ్యిపెట్టేప్పటికి కూరలు మైలపడ్డాయన్నది. కూరలు మైలపట్టమేమిటండీ ? ఎక్కడావినలేదు. అంట్లు సరిగ్గా తోమలేదని పనిదాన్ని నానామాటలూ అని, ఒక్కొక్కగిన్నె మూడేసిసార్లు తోమించింది. అది నిన్నల్లా చూసి, ఈవాళ పనిలోనికిరానని చెప్పేసింది. ఈ కుమ్మరాం

ఎవరు భరిస్తారబ్బా. రెండురోజులకూ డబ్బిచ్చి పొమ్మన్నా అన్నది మా ఆవిడ.

వంటమనిషి మోజుతీరినట్టేనా? ఇంకోచాన్సు చూస్తావా? అని అడిగాను.

మంచిమనిషని ఎవరన్నా చెబితేగాని పెట్టుకోను అన్నది మా ఆవిడ.

ఆరోజో, మర్నాడో నేను మా రామారావుగారింటికి వెళ్ళాను. ఆయనకు బదిలీ అయినట్టు తెలిసింది. ఆయన మాటల సందర్భంలో. "అన్నట్టు మీకు వంట మనిషి ఎవరన్నా కావాలా?" అన్నారు. ఎందుకామాట అడిగారు? అన్నాను. మా హనుమాయమ్మగారిని ఎక్కడన్నా మంచిచోట పెడదామని, అంత మంచిమనిషి దొరకటం మాటలండీ? అన్నాడు రామారావుగారు.

మా ఆవిడ అన్నమాట జ్ఞాపకం వచ్చింది. యింతకంటె మంచి సిఫార్సు ఏంకావాలి? రామారావుగారు ఒక్క డబ్బు విషయంలోనేగాక అన్ని విషయాలలోనూ ఎంతో జాగర్త గల మనిషి. అల్పసంతోషి ఎంత మాత్రం కాదు. "సరే, మీరు వెళ్ళిపోయేప్పుడు ఆవిణ్ణి మాయింటికి పంపండి ఆవిడ కేమిస్తున్నారు?" అని రామారావుగార్ని అడిగాను. భోజనం పెట్టి పదిహేను రూపాయలిస్తున్నాం. అది మామూలే" అన్నాడు రామారావుగారు.

రామారావుగారు బదిలీఅయిన మర్నాడు హనుమాయమ్మగారు మా యింటికి వచ్చేసింది, మిగిలిన విష

యాలు ఎల్లావున్నా హనుమాయమ్మగారిది నలభీమపాకం. కాని మా ఆవిడ నసగడం ప్రారంభించింది. ఈవిడచూస్తే అత్తగారల్లేవుందిగాని వంటావిడల్లేలేదు అన్నది. ఏం జరిగింది? అన్నాను. సంసారాలుచేసేవాళ్ళిట్లా చేసుకుంటారా, అల్లా చేసుకుంటారా అని నన్ను సాధిస్తుందేమిటి? ఈవిడ చేత సాధింపులు పడటానికా వంటమనిషిని పెట్టుకున్నది? అన్నది మా ఆవిడ.

నెల పొంతంగడవకుండా ఈవిణ్ణి మార్చటానికి వీల్లేదు. మా అమ్మ లాటిది, ఆపాటి అనవచ్చునులే అన్నాను.

నెల అయిపోతుందనగా మా ఆవిడ "ఈ వంటావిణ్ణి మారుద్దామండీ. ఆ తిరుమలాంబగారు వంటమనిషికి నెలకు పదే ఇస్తున్నారట. ఈవిడకి పదిహేనెందుకూ?" అన్నది.

"అయిదురూపాయలు నష్టపడుతున్నామనా నీ విచారం? ఈనెల యింటిఖర్చు ఎంతయిందో తెలుసా?" అన్నాను.

ఎంత అయింది? అన్నది మా ఆవిడ.

"రెండు వందలనలభై, హనుమాయమ్మగారి జీతం ఇరవైకి పెంచబోతున్నాను. తిరుమలాంబగారు ఆవిడకి అంతా యిస్తానని అన్నది; కావలిస్తే ఆవిణ్నే అడుగు" అన్నాను.

మీా కిదంతా ఎట్లా తెలిసిందీ? అన్నది మా ఆవిడ తెల్లబోయి.

హనుమాయమ్మగారు నా కెప్పటికప్పుడు చెబుతూనేవుంది. కాకపోయినా నువ్వొక్క-జబ్బు వదిలించుకోవాలి. నువ్వు యజమానురాలివనీ,ఆవిడ నౌకరనీ మరిచిపో. ఆ రోజులు అయిపోయినై అన్నాను.

ఆమాట అన్నందుకు మూడురోజులు మా ఆవిడ నాతో సరిగా మాట్లాడలేదు. మీ దయవల్ల హనుమాయమ్మగారు మాత్రం మా యింటిలోనేవున్నది. వుంటుంది కూడాను!

——····——